సీఏఏ అంటే ఏమిటి..?
ఈ చట్టం తో జరిగే మార్పులు ఏంటి..?




4లో.

RNI NO :Title-Code :-TELTEL02102
జర్నలిస్ట్ వార్త
తెలుగు దినపత్రిక
అనుక్షణం ప్రజలపక్షం...

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త దిన పత్రికలో పనిచేయుటకు
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా, మండల, కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను.
KKR NEWS
ఎడిటర్ : బిర్రు కరుణాకర్
Cell: 9701249103

సంపుటి - 1 సంచిక - 166 మంగళవారం12 మార్చి 2024 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-
Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# ఇందిరమ్మ ఇళ్లు అంటే బడుగుల ఆత్మగౌరవం

**ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభోత్సవంలో రేవంత్ రెడ్డి**
**పేదల కష్టాలను చూసి ఆ రోజు ఇందిరమ్మ ఉచిత ఇళ్ళను ప్రారంభించినట్లు చెప్పిన ముఖ్యమంత్రి**




**ఖమ్మం మార్చి11(జర్నలిస్ట్ వార్త):**
ఖమ్మం ప్రజలు మొదటి నుంచి కేసీఆర్‌ను నమ్మలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. భద్రాచలంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పేదల కష్టాలను చూసి ఆ రోజు ఇందిరమ్మ ఈ ఇళ్ళను ప్రారంభించినట్లు చెప్పారు. భద్రాచల రామచంద్రుడి ఆశీస్సులు తీసుకొని ఈ పథకాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. ఇందిరమ్మ ఇళు అంటే బడుగుల ఆత్మగౌరవమని వ్యాఖ్యానించారు. ఇల్లాలి ముఖంలో సంతోషం ఉంటే ఆ ఇల్లు బాగున్నట్లేనని పేర్కొన్నారు. మహిళ చేతిలో ఇంటి నిర్వహణ ఉంటే ఆ ఇల్లు సంతోషంగా ఉంటుందన్నారు.ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు మహిళల పేరుతోనే ఉంటాయని తెలిపారు. డబుల్ బెడ్రూం ఇళ్ల పేరుతో కేసీఆర్ పదేళ్లు మోసం చేశారని ఆరోపించారు. పేదల కలల మీద కేసీఆర్ ఓట్ల వ్యాపారం చేశారని ధ్వజమెత్తారు. తాము నాలుగున్నర లక్షల మందికి ఇళు ఇవ్వబోతున్నామని తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని గుర్తు చేశారు. గ్యాస్ సిలిండర్‌ను రూ.500కే అందిస్తున్నామన్నారు. తాము డబుల్ బెడ్రూం ఇళ్లు ఇచ్చామని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారని... కానీ ఏ ఊరిలో డబుల్ బెడ్రూం ఇళ్లు ఇచ్చారో ఆ ఊర్లో మేం ఓట్లు అడగం... ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చిన ఊళ్లో వాళ్లు అడవగద్దని... ఈ సవాల్‌కు వారి సిద్ధమేనా? అని ప్రశ్నించారు. తన ఛాలెంజ్‌ను స్వీకరించాలన్నారు.

# అగ్ని-5 క్షిపణి ప్రయోగం విజయవంతం

## గర్విస్తున్నామన్న ప్రధాని మోదీ

**భారత రక్షణ రంగ చరిత్రలో అరుదైన ఘట్టం**
**దేశీయంగా అభివృద్ధి చేసిన అగ్ని-5 ప్రయోగం విజయవంతం**



**మార్చి11(జర్నలిస్ట్ వార్త):**
భారత్ రక్షణ రంగ చరిత్రలో అరుదైన ఘట్టం నమోదైంది. అగ్ని-5 క్షిపణి ప్రయోగం విజయవంతమైంది. ఈ క్షిపణిని పూర్తి దేశీయంగా అభివృద్ధి చేశారు. దీన్ని మొదటిసారిగా గాల్లోకి పంపగా, అంచనాలను అందుకుంటా డీఆర్డీవో శాస్త్రవేత్తలను ఆనందానికి గురిచేసింది. ఈ ప్రాజెక్టును మిషన్ దివ్యాస్త్రగా పేర్కొంటున్నారు.అగ్ని-5 క్షిపణిలో మల్టిపుల్ ఇండిపెండెంట్లీ టార్గెటబుల్ రీ ఎంట్రీ వెహికల్ (ఎంఐఆర్వీ) టెక్నాలజీ వినియోగించారు. ఎంఐఆర్వీ టెక్నాలజీతో రూపొందించిన క్షిపణిని ఒక్కసారి ప్రయోగించాక... అందులోని వార్ హెడ్ పలు శాఖలుగా విడిపోయి, అత్యంత కచ్చితత్వంతో లక్ష్యాన్ని పూర్తిగా నాశనం చేస్తుంది. మొట్టమొదటి ప్రయోగం విజయవంతమైన నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ డీఆర్డీవో సైంటిస్టులను అభినందించారు. డీఆర్డీవో శాస్త్రవేత్తలు చేపట్టిన మిషన్ దివ్యాస్త్ర పట్ల గర్విస్తున్నానని తెలిపారు.కేంద్రమంత్రి కిరణ్ రిజిజు కూడా అగ్ని-5 పరీక్షపై స్పందించారు. ఇక నుంచి భారత్ పై ఎవరైనా దాటి చేయాలనుకుంటే ఒకటికి పది సార్లు ఆలోచించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. అగ్ని-5తో భారత రక్షణ సామర్థ్యం మరో ఎత్తుకు చేరిందని వివరించారు.

# పౌరసత్వ సవరణ చట్టం-2019 (సీఏఏ) అమల్లోకి తీసుకువచ్చిన కేంద్రం...

## నోటిఫికేషన్ విడుదల

**గతంలో వివాదాస్పదమైన పౌరసత్వ సవరణ చట్టం-2019**
**2019లో ప్రతిపక్షాల నిరసనల మధ్యే సీఏఏకి ఆమోదం**
**నిబంధనలపై స్పష్టత లేకపోవడంపై అమలులో ఇన్నాళ్ల పాటు ఆలస్యం**

**మార్చి11(జర్నలిస్ట్ వార్త):**
తీవ్ర వ్యతిరేకతలు ఉన్నప్పటికీ పౌరసత్వ సవరణ చట్టం-2019 (సీఏఏ)ను కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చింది. ఈ మేరకు కేంద్ర హెూంమంత్రిత్వ శాఖ సీఏఏ అమలుపై నోటిఫికేషన్ విడుదల చేసింది.



2లో.

# సార్వత్రిక ఎన్నికల కోసం కసరత్తు

**తెరలేపిన కేంద్ర ఎన్నికల సంఘం**
**దేశంలో త్వరలో సార్వత్రిక ఎన్నికలు**
**ఢిల్లీలో విజ్ఞాన్ భవన్ లో కీలక సమావేశం**
**ఎన్నికల పరిశీలకులకు దిశానిర్దేశం చేసిన చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్**



**మార్చి11(జర్నలిస్ట్ వార్త):**
దేశంలో త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తులకు తెరలేపింది. ఢిల్లీ విజ్ఞాన్ భవన్ లో నేడు కీలక సమావేశం నిర్వహించింది. దేశవ్యాప్తంగా ఎన్నికల విధుల్లో పనిచేసే పరిశీలకులకు కేంద్ర ఎన్నికల సంఘం చీఫ్ కమిషనర్ రాజీవ్ కుమార్ కీలక సూచనలు చేశారు. పోలింగ్ స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేందుకు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఎన్నికల నిర్వాహణలో పరిశీలకులది కీలకపాత్ర అని తెలిపారు. నిబంధనలను పాటించే విధంగా అభ్యర్థులకు దిశానిర్దేశం చేశారు.
కాగా, కేంద్ర ఎన్నికల సంఘంలో రెండు కమిషనర్ పోస్టులు ఖాళీగా ఉన్న సంగతి తెలిసిందే. ఇటీవలే అరుణ్ గోయల్ ఎన్నికల కమిషనర్ పదవికి రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో, ఎన్నికల కమిషనర్ల నియామకం కోసం సెర్చ్ కమిటీ ఏర్పాటు చేశారు. సెర్చ్ కమిటీ పరిశీలనలో సీనియర్ ఐఏఎస్ అధికారిణి రాధా చౌహాన్, మరికొందరి పేర్లు ఉన్నట్టు తెలుస్తోంది. ఈ నెల 15 నాటికి ఎన్నికల కమిషనర్ల నియామకంపై ప్రకటన వెలువడే అవకాశం ఉంది. సెర్చ్ కమిటీ ప్రస్తుతం ఐదుగురి పేర్లతో జాబితా రూపొందించే పనిలో ఉంది. సెర్చ్ కమిటి సిఫారసుల మేరకు సెలెక్ట్ కమిటీ ఎన్నికల కమిషనర్లను ఎంపిక చేయనుంది. అటు, ఎన్నికల కమిషనర్ల నియామకంపై ఇప్పటికే సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. లోక్ సభ ఎన్నికలు కొన్ని వారాల్లో జరగనుండగా, కేంద్ర ఎన్నికల సంఘంలో పరిణామాలు చర్చనీయాంశంగా మారాయి.

# నేను గేట్లు తెరిస్తే.. బిఆర్ఎస్ లో ఎవరూ మిగలరు



- బీజేపీ ఎనిమిది సీట్లతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందా? అని ప్రశ్న
- తాను గేట్లు తెరిస్తే బీఆర్ఎస్‌లో ఎవరూ మిగలరని వ్యాఖ్య
- మోదీ, కేడీ కలిసి ప్రభుత్వాన్ని పడగొట్టాలనుకుంటే
- మేం చూస్తూ ఊరుకుంటామనుకోవద్దని హెచ్చరిక
- మాకు కూడా లోతు తెలుసు.. ఎత్తు తెలుసు..
- పెడితే ఎక్కడకు వెళుతుందో కూడా తెలుసు బిడ్డా... అని వ్యాఖ్య
- బిడ్డా.. మాతో ఎవరూ గోక్కోవద్దు.. గోక్కుంటే బాగుపడరని హెచ్చరిక

**మార్చి11(జర్నలిస్ట్ వార్త):**
బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కైయాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండిపడ్డారు. ఖమ్మం జిల్లా మణుగూరులో కాంగ్రెస్ ప్రజా దీవెన సభలో సిఎం రేవంత్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్, బిజెపిపై విమర్శలు చేశారు. 1969 ఉద్యమం ఖమ్మంలోనే పురుడు పోసుకుంది.. ఈ ఉద్యమం స్పూర్తితోనే రాష్ట్రాన్ని సాధించుకున్నామన్నారు.ఈ జిల్లాకు కాంగ్రెస్ అత్యధిక ప్రాధాన్యత ఇచ్చిందని చెప్పారు. ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నామని.. 24 కోట్ల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఫ్రీగా ప్రయాణం చేశారని తెలిపారు. మాటిస్తే సోనియా గాంధీ..వెనక్కి వెళ్లరన్నారు

మిగతాది 2లో...

# కరీంనగర్‌లో 'కథనభేరి'..

## హాజరుకానున్న కేసీఆర్

**మార్చి11(జర్నలిస్ట్ వార్త):**
బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ నేడు కరీంనగర్ నుంచి పార్లమెంట్ ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తారని ఆ పార్టీ సీనియర్ నేత, కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్ వెల్లడించారు. నేడు సాయంత్రం 4 గంటలకు కరీంనగర్ ఎస్ఆర్ఆర్ మైదానంలో బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ నిర్వహిస్తుంది. ఈ సభకు సంబంధించి వినోద్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. కరీంనగర్ వేదికగా జరగబోయే ఈ కదనభేరికి భారీగా కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు తరలి రావాలని పిలుపునిచ్చారు.నేడు సాయంత్రం 4 గంటల సమయంలో ఎస్ఆర్ఆర్ మైదానం నుంచి పార్లమెంట్ ఎన్నికల ప్రచారాన్ని కేసీఆర్ ప్రారంభిస్తారన్నారు.



## రంజాన్ దీక్షలు ప్రారంభం




**మార్చి11(జర్నలిస్ట్ వార్త):** ముస్లింలు అత్యంత పవిత్ర మాసంగా భావించే రంజాన్ మాసం మంగళవారం నుంచి ప్రారంభమవుతోంది. భారత్ లో నెలవంక కనిపించడంతో మంగళవారం నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు మంగళవారం నుంచి చేపట్టవచ్చని ముస్లిం మత పెద్దలు ప్రకటించారు.
లక్నో,ఆగ్రా, కోల్ కతాలో నెలపొడుపు సాయంత్రం 6.52 నిమిషాలకు కనిపించడంతో పవిత్ర రంజాన్ మాసం మంగళవారం నుంచి మొదలవుతుంది.

### నెల పాటు కఠోర ఉపవాస దీక్షలు..

ముస్లింలు అత్యంత భక్తి, శ్రద్ధలతో, నియమ, నిష్టలతో ఈ నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు చేపడతారు. సూర్యోదయం నుంచి సూర్యస్తమయం వరకు కనీసం మంచినీళ్లు కాదు కదా కనీసం నోటిలోని లాలా జలాన్ని కూడా మింగకుండా భగవంతుడ్ని ప్రార్థిస్తారు. రోజులో సూర్యోదయానికి ముందు సహర్ నుంచి సూర్యస్తమయం ఇఫ్తార్ వరకు రోజూకు ఐదు సార్లు నమాజ్ చేస్తారు.
ఐదు సార్లు నమాజ్ చేయడంతో పాటు రాత్రి 8.30గంటల నుంచి రాత్రి 10గంటల మధ్య కాలంలో తరావీహ్ నమాజులో ఖురాన్ చదువుతారు. ఈ నెల రోజుల్లో సఫిల్ చదివితే ఫరజ్ చదివినంత పుణ్యమని ఇస్లాం గ్రంధాల్లో ఉంది. ముస్లిం మతపెద్దలు కూడా అదే చెబుతుంటారు

## పౌరసత్వ సవరణ చట్టం-2019 (సీఏఏ) అమల్లోకి తీసుకువచ్చిన కేంద్రం...

**మార్చి11(జర్నలిస్ట్ వార్త):** ఈ చట్టం ప్రకారం... పొరుగుదేశాలైన బంగ్లాదేశ్, పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ ల నుంచి ముస్లిమేతరులు వలస వస్తే, వారివద్ద సరైన పత్రాలు లేకపోయినా భారతదేశ పౌరసత్వం ఇచ్చేందుకు సీఏఏ ఉపయోగపడుతుంది. 2014 డిసెంబరు 31కి ముందు ఈ మూడు దేశాల నుంచి భారత్ లో ప్రవేశించిన హిందువులు, సిక్కులు, బౌద్ధులు, క్రైస్తవులు, పార్శీలు, జైనులు భారత పౌరసత్వం పొందేందుకు సీఏఏ ఉపకరిస్తుంది. 2019లో సీఏఏ చట్టం తీసుకువచ్చారు. పార్లమెంటులో దీనిపై విపక్షాలు తీవ్రస్థాయిలో నిరసనలు వ్యక్తం చేశాయి. ఉభయ సభల్లో బీజేపీకి ఉన్న బలం దృష్ట్యా సీఏఏకి పార్లమెంటు ఆమోదం లభించడంతో రాష్ట్రపతి కూడా రాజముద్ర వేశారు. అయితే సీఏఏ నిబంధనలు, మార్గదర్శకాలపై స్పష్టత లేకపోవడంతో దీని అమలు ఆలస్యం అయింది. సార్వత్రిక ఎన్నికలకు ముందే సీఏఏ అమలుపై నోటిఫికేషన్ విడుదల చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెప్పిన మేరకు నోటిఫికేషన్ విడుదల చేశారు.

## నేను గేట్లు తెరిస్తే.. బిఆర్ఎస్ లో ఎవరూ మిగలరు

**మార్చి11(జర్నలిస్ట్ వార్త):** బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కైయాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండిపడ్డారు. ఖమ్మం జిల్లా మణుగూరులో కాంగ్రెస్ ప్రజా దీవెన సభలో సిఎం రేవంత్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్, బిజెపిపై విమర్శలు చేశారు. 1969 ఉద్యమం ఖమ్మంలోనే పురుడు పోసుకుంది.. ఈ ఉద్యమం స్ఫూర్తితోనే రాష్ట్రాన్ని సాధించుకున్నామన్నారు. ఈ జిల్లాకు కాంగ్రెస్ అత్యధిక ప్రాధాన్యత ఇచ్చిందని చెప్పారు. ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నామని.. 24 కోట్ల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఫ్రీగా ప్రయాణం చేశారని తెలిపారు. మాటిస్తే సోనియా గాంధీ..వెనక్కి వెళ్లరన్నారు



సిఎం. ఈ ప్రాంతం నుంచి వచ్చిన భట్టీ, తుమ్మల, పొంగులేటి కేబినేట్ లో కీలకంగా ఉన్నారని%ా% భూమిలేని పేదలను ఆదుకునే బాధ్యత మా పై ఉందన్నారు. ఇల్లు లేని ప్రతి కుటుంబానికి ఇల్లు నిర్మించి ఇస్తామని రేవంత్ చెప్పారు. రూ. 400 సిలిండర్ ను రూ. 1200లకు పెంచారని.. బిఆర్ఎస్, బిజెపి కలిసి పేద ఆడబిడ్డల సొమ్మును అప్పనంగా దోచుకున్నారని దుయ్యబట్టారు. మా ప్రభుత్వం మంచి పనులు చేస్తుంటే.. కెసిఆర్ కుటుంబం ఓర్వలేక మాపై శాపనార్థాలు పెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల తర్వాత మా ప్రభుత్వాన్ని కూలుస్తారంట.. బిజెపి, బిఆర్ఎస్ మా ప్రభుత్వాన్ని కూల్చే కుట్ర చేస్తున్నారని.. ఎనిమిది స్థానాలతో బిజెపి ఎలా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తోందని ప్రశ్నించారు. మోడీ, ఖేడీలు కలిసి కుట్ర చేస్తే చూస్తూ ఊరుకోం.. మేము గేట్లు తెరిస్తే బిఆర్ఎస్ లో ఎవ్వరూ మిగలరన్నారు. రెండు పార్టీలు అవగహనతోనే సీట్లు ప్రకటించారని చెప్పారు. బిఆర్ఎస్ అంటే బిల్లా రంగా సమితి.. ప్రాజెక్టుల పేరుతో వేల కోట్ల రూపాయలు దోచుకున్నారని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు.

# అందరూ సమానంగా కూర్చోవాల్సిన గుడిలో అవమానిస్తారా?

## రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలి: కవిత డిమాండ్

**మార్చి11(జర్నలిస్ట్ వార్త):** ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి కొండా సురేఖలను అవమానించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ... అందరూ సరిసమానంగా కూర్చోవాల్సిన యాదాద్రి దేవాలయంలో భట్టి విక్రమార్క, కొండా సురేఖలను కింద కూర్చోబెట్టి అగ్రవర్ణ నాయకులను పైన కూర్చోబెట్టడం వివక్షకు నిదర్శనం కాదా? అని ప్రశ్నించారు. ఈ వైఖరి పట్ల తాను



బాధపడుతున్నానని... అందుకే తక్షణమే రేవంత్ రెడ్డి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.
ఒకవేళ అక్కడ అందరికి సరిపోయేలా టేబుల్స్ లేకుంటే అందరూ నిలబడాల్సిందన్నారు. లేదంటే సీఎం రేవంత్ రెడ్డి తండ్రి స్థానంలో ఉన్నందున ఆయన లేచి నిలబడి ప్రసాదం తీసుకుంటే బాగుండేదని సూచించారు. గౌరవం ఇవ్వాలనే ఆలోచన ఉంటే ఇవ్వవచ్చునన్నారు. రేవంత్ రెడ్డి ప్రతిపక్ష నేతలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి కేబినెట్లో రజకులు, ముస్లింలు, ముదిరాజ్‌లు, ఎస్టీలు, యాదవ, కుర్మా, వడ్డెర, విశ్వబ్రాహ్మణులు లేరన్నారు. ప్రభుత్వ సలహాదారుల్లో అందరూ అగ్రవర్ణాలవారేనని... ఒక్కరూ బీసీ, ఎస్టీలు లేరన్నారు.

## దేవుడి సాక్షిగా ఉప ముఖ్యమంత్రికి అవమానం : ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

**మార్చి11(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సతీ సమేతంగా యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్నారు. ఆయనతో పాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డిలు స్వామి వారిని దర్శించుకున్నారు. పూజ సమయంలో రేవంత్, ఆయన భార్య, కోమటిరెడ్డి, ఉత్తమ్ లు కొంత ఎత్తున్న స్టూళ్లపై కూర్చున్నారు. వీరి పక్కన మల్లు భట్టి తక్కువ ఎత్తున్న పీఠంపై కూర్చున్నారు. దీనిపై విపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. బీఎస్పీ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ... దేవుడి సాక్షిగా ఉప





ముఖ్యమంత్రికి అవమానం జరిగిందని అన్నారు. ఈ అవమానాలు లేని భారతం కోసమే బీఎస్పీ పోరాటమని చెప్పారు. ఇదే అంశంపై బీఆర్ఎస్ పార్టీ కూడా విమర్శలు గుప్పించింది. యాదాద్రి దేవాలయం సాక్షిగా దళితుడైన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను, బహుజన బిడ్డ కొండా సురేఖను రేవంత్ రెడ్డి అండ్ కో ఘోరంగా అవమానించిందని ట్వీట్ చేసింది. వారు పైన కూర్చుని భట్టి విక్రమార్క, కొండా సురేఖను రేవంత్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి అవమానించారని వ్యాఖ్యానించింది

## తెలంగాణ ఉన్నంత వరకు బీఆర్ఎస్ ఉంటుంది: హరీశ్ రావు



**మార్చి11(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ ఉన్నంత వరకు బీఆర్ఎస్ ఉంటుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. బీఆర్ఎస్ పని అయిపోయిందన్న బీజేపీ, కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలపై ఆయన తీవ్రంగా స్పందించారు. సోమవారం మెదక్ జిల్లా తూప్రాన్ మండలం వెంకటాయపల్లిలో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్, బీజేపీలు బీఆర్ఎస్ పార్టీని లేకుండా చేయాలని కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. కానీ తెలంగాణ అంటేనే బీఆర్ఎస్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ చెప్పింది కొండంత... చేస్తుంది మాత్రం గోరంతే అని విమర్శించారు. ఎన్నికలకు ముందు రుణమాఫీ చేస్తానని చెప్పిందని... కానీ ఆ హామీ ఏమైంది? అని ప్రశ్నించారు.

## మాజీ ఎస్ఐబీ డీఎస్పీ ప్రణీత్ రావు అరెస్ట్..

**మార్చి11(జర్నలిస్ట్ వార్త):** బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష నేతల ఫోన్ ట్యాపింగ్ చేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎస్ఐబీ డీఎస్పీ డి.ప్రణీత్ రావును రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్‌లో పంజాగుట్ట పోలీసులు అరెస్టు చేశారు. రాష్ట్రంలో ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ కార్యాలయంలో నిఘా కెమెరాలు పని చేయకుండా చేసి ఆఫీసులోని హార్డ్ డిస్కులు ధ్వంసం చేసిన కేసులో ప్రణీత్‌రావు కీలక నిందితుడి ఉన్నారు. అయితే, ఇటీవలే అధికారంలోకి వచ్చిన సర్కార్ ఆయనను విధుల నుంచి సస్పెండ్ చేసింది. అదేవిధంగా ప్రణీత్‌రావుతో పాటు ఈ కేసులో సంబంధమున్న ఇతరులపై చర్యలు చేపట్టాలని అడిషనల్ ఎస్పీ రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు ఆయనపై ఐపీసీ 409, 427, 201తో పాటు ఐటీ ఆక్ట్ సెక్షన్ 65, 66, 70 ప్రకారం పోలీసులు పలు కేసు నమోదు చేశారు. కాగా, ప్రణీత్ రావు విచారణలో పోలీలసులకు కళ్లు బైర్లు కమ్మే విషయాలు



వెలుగులోకి వచ్చాయి. ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి సస్పెండ్ అయిన డీఎస్పీ ప్రణీత్‌రావు స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ కార్యాలయం నుంచి దాదాపు 42 హార్డ్ డిస్క్‌లను మాయం చేసినట్లుగా పోలీసులు వెల్లడించారు. అదేవిధంగా 1,610 పేజీల కాల్ డేటాను సైతం కాలబెట్టినట్లుగా నిర్ధారించారు. ఇక కీలకమైన ఎస్ఓటి లాకర్ రూంలోని ఫైల్స్, ఓ కీలక నేత ఫోన్ ట్యాపింగ్ డేటాతో పాటు కాల్ రికార్డులు కొన్ని ఐఎంఈఐ నెంబర్లతో పాటు ఐపీడీఆర్ డేటాని కూడా ట్రాష్ చేసినట్లుగా విచారణలో వెల్లడైంది. అదేవిధంగా ఈ కేసుకు సంబంధం ఉన్న అప్పటి ప్రభుత్వ పెద్దల పేర్లు కూడా త్వరలో బయటకొచ్చే ఛాన్స్ ఉందని జోరుగా చర్చ జరుగుతోంది.

## సీఏఏ నిబంధనలను అయిదేళ్ల పాటు ఎందుకు పెండింగ్‌లో పెట్టారు?



**మార్చి11(జర్నలిస్ట్ వార్త):** పౌరసత్వ సవరణ బిల్లు-2019 ని కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అమల్లోకి తీసుకు రావడంపై మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ స్పందించారు. సోమవారం ఆయన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా... సీఏఏ నిబంధనలను అయిదేళ్ల పాటు ఎందుకు పెండింగ్‌లో పెట్టారు? ఇప్పుడు ఎన్నికలకు ముందు అమలు చేయడం ఏమిటి? అని ప్రశ్నించారు. ఈ అంశంపై తమకు కొన్ని అభ్యంతరాలు ఉన్నాయన్నారు. మతం ఆధారంగా కాకుండా హింసకు గురైన వారికి ఆశ్రయం ఇవ్వాలని సూచించారు. ముస్లింలు లక్ష్యంగా సీఏఏ, ఎన్ఆర్పీ-ఎన్ఆర్సీ తీసుకు వచ్చారని ఆరోపించారు.

## ధరణి దరఖాస్తుల పరిశీలనకు.. గడువు పొడిగించిన ప్రభుత్వం

**మార్చి11(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ధరణి దరఖాస్తుల పరిశీలన గడువును పెంచింది. ఈనెల 17వ తేదీ వరకు పొడిగిస్తూ సోమవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, ధరణి పెండింగ్ దరఖాస్తులకు సంబంధించిన స్పెషల్ డ్రైవ్ ఈనెల 1 నుంచి 9 వరకు నిర్వహించి పరిష్కారించాలని




ప్రభుత్వం ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ డ్రైవ్‌లో ఇప్పటి వరకు 1.06 లక్షల దరఖాస్తులకు పైగా రెవెన్యూ బృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి, డెస్క్‌వర్క్‌ను సిద్ధం చేసినట్లు సమాచారం. పెండింగ్ దరఖాస్తుల పరిశీలనకు తహసిల్దార్ కార్యాలయం సిబ్బందిని ప్రత్యేక బృందాలుగా నియమించారు. ఈ బృందాలు ప్రస్తుతం ధరణి పెండింగ్ దరఖాస్తులకు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తూ, ఫీల్డ్‌లో కూడా దరఖాస్తుదారుడే ఉన్నాడా.. లేదా? అన్నది నిర్ధారించుకునేందుకు క్షేత్ర స్థాయి సర్వే చేపట్టాయి. ధరణి పోర్టల్‌లో ఆర్డీవోలు, తహసీల్దారులకు లాగిన్ ఆదేశాలు రాగానే పెండింగ్ దరఖాస్తుల ఆన్‌లైన్ వర్క్ త్వరలో ప్రారంభం అవుతుందని రెవెన్యూ ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు

# పరీక్ష సామాగ్రి పంపిణీ అభినందనీయం

## : రాంరెడ్డి దామోదర్ రెడ్డి:

**సూర్యాపేటమార్చి11(జర్నలిస్ట్ వార్త):** అక్షర ఫౌండేషన్ సూర్యాపేట ఆధ్వర్యంలో సుధాకర్ పీ.వీ.సీ ప్రొడక్ట్ ప్రయివేటు లిమిటెడ్ సూర్యాపేట వారి సౌజన్యం తో ఈరోజు మారుతీ విద్యానికేతన్ ట్రస్ట్ స్కూల్ శాంతి నగర్ నందు సూర్యాపేట జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివే 10 తరగతి వార్షిక పరీక్షలు రాయబోయే విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ కార్యక్రమానికి మాజీమంత్రి వర్యులు రాంరెడ్డి దామోదర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. దామోదర్ రెడ్డి మాట్లాడుతూ ఈనాటి సమాజంలో విద్య, వైద్య రంగాలకు చాలా ప్రాముఖ్యత ఉన్నదని, విద్యార్థులు అందరూ కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ,తల్లిదండ్రుల కలలను నిజం చేయాలని తెలిపారు. విద్యార్థులు అందరూ అన్నీ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అక్షర ఫౌండేషన్ వారు చేస్తున్న విద్య, వైద్య, క్రీడా సాంస్కృతిక, సామాజిక, వృత్తి నైపుణ్య రంగాలలో విశేష సేవలందిస్తున్న అక్షర ఫౌండేషన్ సభ్యులను అభినందించారు. ప్రభుత్వం తరపున అక్షర ఫౌండేషన్ వారికి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. విద్యార్థులకు ప్యాడ్స్,పెన్నులు, పెన్సిళ్లు, స్కెళ్ళు అందజేశారు. పాఠశాలకు ఎనిమిది వేల రూపాయల గ్రంధాలయ పుస్తకాలు కూడా అందజేసారు.




ఈ కార్యక్రమంలో సుధాకర్ పి.వీ.సీ మేనేజింగ్ డైరెక్టర్ మీలా మహాదేవ్, అక్షర ఫౌండేషన్ చైర్మన్ యాస రాంకుమార్ రెడ్డి, బత్తుల దామోదర్ రెడ్డి, రుద్రంగి కాళిదాసు, ఆరే శ్రీలత, శర్మ, మూర్తి, డా.మీలా సందీప్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజావాణి కార్యక్రమానికి 10 పిర్యాదులు

### పిర్యాదుదారులతో మాట్లాడి పిర్యాదులు పరిశీలించిన ఎస్పీ .




**సూర్యాపేటమార్చి11(జర్నలిస్ట్ వార్త):** శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కరిస్తూ బాధితులకు అండగా ఉంటూ ఫిర్యాదుల పై వెంటనే చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయం లో ప్రజావాణి సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి 10 పిర్యాదు వచ్చినాయి, వివిధ సమస్యల పై బాధితుల నుండి వచ్చిన అర్జిలను , జిల్లా ఎస్పీ స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ ప్రజావాణి లో బాధితుల నుండి వచ్చిన ఫిర్యాదుల పై ఆయా పోలీసు స్టేషన్ ల అధికారులతో మాట్లాడుతూ పోలీసు పరిధిలోని ప్రతి అంశాన్ని చట్ట పరిదిలో పరిష్కరించడంలో, బాధితులకు న్యాయం చేయడంలో వేగంగా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఎస్పీ ఆదేశించారు. బాధితులకు ఖచ్చితంగా న్యాయం జరుగుతుందని భరోసా కల్పించారు. భార్యాభర్తల తగాదాల వల్ల సమస్యలు పెరిగి కుటుంభం విడిపోతుంది, పిల్లలు మంచి భవిష్యత్తును కోల్పోతారు, సమాజంలో గౌరవం తగ్గుతుంది కావున భార్యాభర్తలు సమస్యలను అధిగమించి మంచి తల్లిదండ్రులుగా ఉండాలని ఎస్పి కోరినారు.చట్టవ్యతిరేకంగా వ్యవహరిస్తూ శాంతిభద్రతల పరిస్థితులకు భంగం కలిగించేవారి పట్ల, మహిళలపై జరిగే వేదింపులు పట్ల కఠినంగా వ్యవహరించాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు.

# పార్టీ మారుతున్నట్లు నా పై జరుగుతున్న రాజకీయ దుష్ప్రచారాన్నీ ఖండిస్తున్నా

**సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడుతున్న టి.పి.సి.సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ పటేల్ రమేష్ రెడ్డి:**



**మార్చి11(జర్నలిస్ట్ వార్త):**


నా రాజకీయ ప్రత్యర్థులు నా ఎదుగుదలను ఓర్వలేకనే నాపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. నన్ను బదనాం చేసే చర్యలు మానుకోవలన్నారు.
పార్టీ మార్పు ప్రచారం ప్రత్యర్థుల కుట్ర మాత్రమే. కొన్ని మీడియాల్లో వ్యతిరేక వార్తలు వస్తున్నాయి .
ఎలాంటి కారణాలు చూపకుండా వార్తలు రాస్తున్న వారిపై పరువు నష్ట దావా వేస్తాం నా రాజకీయ ప్రయాణం తెరిచిన పుస్తకం ఎమ్మెల్యే టికెట్ ఆశించినప్పుడు పార్లమెంట్ టికెట్ పై హామీ ఇచ్చారు పార్టీ నిర్ణయం బాధగా ఉన్నా అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటా. రేవంత్ నా చిన్ననాటి మిత్రుడు ఆయనకు నా పూర్తి మద్దతు ఉంటుందన్నారు చివరి శ్వాస వరకు కాంగ్రెస్ , రేవంత్ తోనే ఉంటాను.ఏ పార్టీలు నన్ను సంప్రదించలేదు , ఆ ధైర్యం ఎవరికి లేదు నా జీవిత కాంగ్రెస్ కి , సూర్యాపేట ప్రజలకు అంకితం. నల్లగొండ పార్లమెంట్ టికెట్ పై నాతో అధిష్టానం సంప్రదింపలు జరిపారు..
నాకు సముచిత స్థానం కల్పిస్తామని ఏ.ఐ.సీ.సీ, పీ.సీ.సీ నుండి స్పష్టమైన హామీ ఉందన్నారు.

# తెలంగాణ ముఖ్యమంత్రి కాన్వాయ్ ఢీకొని పోలీస్ అధికారికి గాయాలు

**- కొత్తగూడెం భద్రాద్రి జిల్లాలో ఘటన**

**- రేవంత్ రెడ్డి కాన్వాయ్ ఢీకొని భద్రాచలం ఏఎస్పీ పారితోశ్ పంకజ్‌కు గాయాలు**

**- పారితోశ్‌ను ఆసుపత్రికి తరలించిన అధికారులు**



**మార్చి11(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాన్వాయ్ ఢీకొని భద్రాచలం ఏఎస్పీ పారితోశ్ పంకజ్‌కు గాయాలయ్యాయి. దీంతో అధికారులు ఆయనను ఆసుపత్రికి తరలించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ రోజు ఖమ్మం జిల్లాలో పర్యటిస్తున్నారు. ఉదయం యాదగిరి లక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకున్న రేవంత్ రెడ్డి ఆ తర్వాత భద్రాచలంలో శ్రీ సీతారామచంద్రస్వామిని దర్శనం చేసుకున్నారు. అనంతరం భద్రాచలంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించారు. సాయంత్రం మణుగూరులో ప్రజాదీవెన సభ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# భట్టివిక్రమార్కకి అవమానం అంటూ బీఆర్ఎస్ మొసలి కన్నీరు

### : పక్కన కూర్చోబెట్టడంపై మల్లు రవి వివరణ

**మార్చి11(జర్నలిస్ట్ వార్త):** యాదగిరిగుట్టలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు అవమానం జరిగిందంటూ బీఆర్ఎస్ నాయకులు మొసలి కన్నీరు కారుస్తున్నారని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి మండిపడ్డారు. సోమవారం ఆయన గాంధీ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ... దళితులకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పదవులు ఇచ్చిన పార్టీ కాంగ్రెస్ మాత్రమే అన్నారు. బీఆర్ఎస్ దళితులను, దళిత నాయకులను ఎలా అవమానించిందో అందరికి తెలుసునన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు భట్టి విక్రమార్కకు ప్రధాన ప్రతిపక్ష హోదా ఇస్తే సీఎల్పీ విలీనం అంటూ కొత్త కథ అల్లి ఆయనకు ప్రధాన ప్రతిపక్ష హోదా లేకుండా చేసిందని ఆరోపించారు.కానీ ఇప్పుడేమో అవమానం అంటూ మొసలి కన్నీరు కారుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత ముఖ్యమంత్రి అని ప్రగల్భాలు పలికిన కేసీఆర్ పదేళ్లు పాలించారని మండిపడ్డారు. కానీ మల్లు భట్టికి ఉపముఖ్యమంత్రిగా, ప్రధాన ప్రతిపక్ష నేతగా అవకాశం ఇచ్చిన పార్టీ కాంగ్రెస్ అన్నారు.



**పక్కన కూర్చోబెట్టడంపై వివరణ**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పక్కన యాదగిరిగుట్టలో నల్గొండ జిల్లా మంత్రులను కూర్చోబెట్టారని, మిగతా వారిని ఆ పక్కన కూర్చోబెట్టారన్నారు. భద్రాచలంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన... ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కని కూర్చోబెట్టారని వివరించారు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, మంత్రులు చాలా సఖ్యతతో, సమన్వయంతో ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్నారన్నారు. కాంగ్రెస్‌లో జరిగే అంశాలపై బీఆర్ఎస్ నేతలు మాట్లాడాల్సిన అవసరం లేదని మల్లు రవి చురక అంటించారు.

# ఎమ్మెల్సీలుగా మా అభ్యర్థిత్వాన్ని ఆమోదించండి

### గవర్నర్ తమిళిసైకి దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణ విజ్ఞప్తి



**మార్చి11(జర్నలిస్ట్ వార్త):** హైదరాబాద్/పంజగుట్ట: ఎమ్మెల్సీలుగా రాజ్యాంగబద్ధంగా నామినేటైన తమ అభ్యర్థిత్వాన్ని ఆమోదించాలని దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణ..
గవర్నర్ తమిళిసైకి విజ్ఞప్తి చేశారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా తమ పేర్లను ఆమోదించాల్సిందిగా చేతులెత్తి మొక్కుతున్నట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నామినేట్ అయిన దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణ సోమవారం రాజ్‌భవన్‌లో వినతిపత్రం సమర్పించారు. తమ విజ్ఞాపనతో పాటు ఇటీవల హైకోర్టు వెలువరించిన 88 పేజీల తీర్పు కాపీని కూడా జత చేసి గవర్నర్ కార్యాలయంలో అందజేశారు. తమను ఎమ్మెల్సీలుగా ఆమోదించాలని రాజ్‌భవన్ గేట్లకు మొక్కారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం తమను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నామినేట్ చేసినా, 55 రోజుల తర్వాత కేబినెట్ ప్రతిపాదనను గవర్నర్ తిరస్కరించారని దాసోజు శ్రవణ్ మీడియాకు తెలిపారు. అయితే తమ అభ్యర్థిత్వాన్ని గవర్నర్ తిరస్కరించడంపై హైకోర్టును ఆశ్రయించామన్నారు. మరోవైపు కొత్త ప్రభుత్వం గవర్నర్ కోటాలో కోదండరాం, అమేర్ అలీఖాన్ పేర్లను ప్రతిపాదించగా గవర్నర్ ఆమోదించారన్నారు. ఈ మేరకు గెజిట్ కూడా విడుదల కాగా, కోదండరాం, అమేర్ అలీఖాన్‌లను నామినేట్ చేయడం రాజ్యాంగ ఉల్లంఘన అని హైకోర్టు పేర్కొందన్నారు. అట్టడుగు కులాలకు చెందిన తమకు న్యాయం చేయాలని దాసోజు గవర్నర్‌కు విజ్ఞప్తి చేశారు. తాము ఇద్దరూ గతంలో బీజేపీ, దాని అనుబంధ విభాగాల్లో పనిచేశామని దాసోజు, కుర్రా సత్యనారాయణ తమ వినతిపత్రంలో పేర్కొన్నారు

# చేవెళ్ల, నల్గొండ, భువనగిరిలో అభ్యర్థుల ఎంపికపై కేసీఆర్ కసరత్తు

**మార్చి11(జర్నలిస్ట్ వార్త):**
హైదరాబాద్: భారాస తరపున చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ అభ్యర్థిగా కాసాని జ్ఞానేశ్వర్ పేరు ఖరారైనట్లు సమాచారం. చేవేళ్లతో పాటు నల్గొండ జిల్లాలోని రెండు లోక్‌సభ నియోజకవర్గాల (భువనగిరి, నల్గొండ) ఎన్నికల కార్యాచరణపై పార్టీ అధినేత కేసీఆర్ దిశానిర్దేశం చేశారు.
చేవెళ్లలో సిట్టింగ్ ఎంపీ రంజిత్ రెడ్డి ఎన్నికల పోటీ నుంచి తప్పుకోవడంతో ప్రత్యామ్నాయంగా అభ్యర్థి విషయమై సమావేశంలో చర్చించారు. కొన్ని వ్యక్తిగత, ఇతర కారణాల రీత్యా రంజిత్‌రెడ్డి ఎన్నికల్లో పోటీ చేయడం లేదని.. ఆయన ఎక్కడికీ వెళ్లారని పార్టీలోనే కొనసాగుతారని కేసీఆర్ నేతలకు వివరించినట్లు తెలిసింది. శాసనసభ ఎన్నికల ఫలితాల పరంగా చూస్తే మెజార్టీ ఉందని, లోక్‌సభ ఎన్నికల్లోనూ పార్టీ విజయం సాధిస్తుందన్న ధీమా వ్యక్తం చేసినట్లు సమాచారం. కాసాని జ్ఞానేశ్వర్ అభ్యర్థిత్వానికి నేతలు మొగ్గు చూపినట్లు సమాచారం.లోక్‌సభ టికెట్ ఆశించి, ఆ తర్వాత వెనక్కి తగ్గిన గుత్తా సుఖేందర్ రెడ్డి తనయుడు అమిత్ రెడ్డి ఉమ్మడి నల్గొండ జిల్లా నేతల సమావేశానికి హాజరు కాలేదు. ఆశావహ అభ్యర్థులకు సంబంధించి కేసీఆర్ ఆరా తీశారు. అభ్యర్థులకు సంబంధించిన అన్ని విషయాలను మాజీ మంత్రి జగదీష్ రెడ్డికి చెప్పినట్లు నేతలు పేర్కొన్నారు.



# వైసీపీని గద్దె దించడమే లక్ష్యం

## సీట్ల సర్దుబాటుపై ఓ అవగాహనకు వచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ...!

### చంద్రబాబు నివాసంలో 8 గంటల పాటు చర్చలు
### జనసేన, బీజేపీకి 31 అసెంబ్లీ స్థానాలు, 8 ఎంపీ సీట్లు



**మార్చి11(జర్నలిస్ట్ వార్త):** ఏపీలో వైసీపీని గద్దె దించడమే లక్ష్యంగా చేతులు కలిపిన టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య సీట్ల సర్దుబాటుపై ఓ అవగాహన కుదిరింది. ఉండవల్లిలో టీడీపీ అధినేత చంద్రబాబు సమావేశంలో ఈ మధ్యాహ్నం నుంచి దాదాపు 8 గంటల పాటు సుదీర్ఘంగా జరిగిన సమావేశం ముగిసింది. టీడీపీ తరఫున చంద్రబాబు, జనసేన నుంచి పవన్ కల్యాణ్, బీజేపీ తరఫున గజేంద్ర సింగ్ షెకావత్, బైజయంత్ పండా ఈ సమావేశంలో పాల్గొన్నారు. సీట్ల సర్దుబాటు, ఎవరెక్కడ పోటీ చేయాలన్న అంశంపై క్షుణ్ణంగా చర్చించారు. సుదీర్ఘ సమావేశం అనంతరం సీట్ల పంపకం వ్యవహారం ఓ కొలిక్కి వచ్చినట్టు తెలుస్తోంది. పొత్తులో భాగంగా జనసేన, బీజేపీకి 31 అసెంబ్లీ స్థానాలు, 8 ఎంపీ స్థానాలు కేటాయించారు. ఇందులో జనసేన 21 అసెంబ్లీ స్థానాలు, 2 ఎంపీ స్థానాల్లో పోటీ చేయనుండగా... బీజేపీ 10 అసెంబ్లీ స్థానాలు, 6 లోక్ సభ స్థానాల్లో పోటీ చేయనుంది. ఇక, టీడీపీ 144 అసెంబ్లీ స్థానాలు, 17 ఎంపీ స్థానాల్లో బరిలో దిగనుంది. ఇటీవల జనసేన 24 అసెంబ్లీ స్థానాలు, 3 ఎంపీ స్థానాల్లో పోటీ చేస్తుందని ప్రకటించినప్పటికీ, బీజేపీ కూడా పొత్తులోకి వచ్చిన నేపథ్యంలో ఆ ప్రకటనకు నేడు సవరణ చేసినట్టు తెలుస్తోంది. సీట్ల సర్దుబాటు ఓ కొలిక్కి వచ్చిన నేపథ్యంలో, మూడు పార్టీలు అభ్యర్థుల జాబితాలపై దృష్టి సారించనున్నాయి.

# యాదాద్రి, భద్రాద్రిలో సీఎం రేవంత్‌రెడ్డి..





**మార్చి11(జర్నలిస్ట్ వార్త):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యాదగిరిగుట్ట, భద్రాద్రిలో పర్యటించారు. ముందుగా ఆయన యాదాద్రిలో నేటి నుంచి ప్రారంభమైన బ్రహ్మోత్సవాలలో పాల్గొన్నారు.. ఉదయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతులు యాదగిరిగుట్ట లక్ష్మినరసింహ స్వామిని దర్శించుకున్నారు. యాదాద్రికి చేరుకున్న సీఎంకు ఆలయ అర్చకులు పూర్ణ కుంభ స్వాగతం పలికారు. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో సీఎం రేవంత్ రెడ్డి దంపతులు, మంత్రుల బృందం పాల్గొన్నారు.
వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలి రోజు ప్రభుత్వం తరుపున స్వామి వారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను ముఖ్యమంత్రి రేవంత్ సమర్పించారు. సీఎం వెంట డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు కొండా సురేఖ, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉన్నారు. అలాగే ఎమ్మెల్యేలు బీర్ల అయిలయ్య, కుంభం అనిల్ కుమార్ రెడ్డి, వేముల వీరేశం, బీఎల్ఆర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. యాదాద్రి నుంచి నేరుగా హెలికాప్టర్ లో సిఎం భద్రాచలం చేరుకున్నారు. అనంతరం శ్రీ సీతారామచంద్ర స్వామిని రేవంత్ దంపతులు దర్శించుకున్నారు. రామాలయానికి చేరుకున్న సీఎం రేవంత్ దంపతులకు దేవస్థానం అర్చకులు, సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం సీతారామచంద్ర స్వామి వారిని ముఖ్యమంత్రి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉపాలయం లక్ష్మీ తాయారు అమ్మ వారి ఆలయంలో రేవంత్ దంపతులకు వేద ఆశీర్వాదం అందించారు. ముఖ్యమంత్రి వెంట డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల పొంగులేటి, కొండా సురేఖ, సీతక్క ఉన్నారు.

# సీఏఏ అంటే ఏమిటి..? ఈ చట్టం తో జరిగే మార్పులు ఏంటి..?

**మార్చి11(జర్నలిస్ట్ వార్త):** లోక్‌సభ ఎన్నికల వేళ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. 2019లో తీసుకువచ్చిన పౌరసత్వ సవరణ చట్టాన్ని అమల్లోకి తీసుకువస్తూ కేంద్ర హోంశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.
ఎన్నికలకు ముందే పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)ను అమలు చేస్తామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే సోమవారం సాయంత్రం ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు వచ్చేశాయి. నాలుగేళ్ల క్రితమే ఈ బిల్లు చట్టంగా మారినా.. తీవ్ర వివాదస్పదం కావడంతో ఇన్నాళ్లు అమలు చేయలేదు. సీఏఏను పలు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా వ్యతిరేకిస్తున్నాయి. తెలంగాణ, తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్, రాజస్థాన్, పంజాబ్ తదితర రాష్ట్రాలు సీఏఏకు వ్యతిరేకంగా తీర్మాణాలు చేశాయి.




**సీఏఏ చట్టానికి సంబంధించి కీ పాయింట్స్..**

– బంగ్లాదేశ్, పాకిస్థాన్, ఆఫ్ఘనిస్తాన్ దేశాల నుంచి డిసెంబర్ 31, 2014 లేదా అంతకు ముందు భారతదేశానికి వచ్చిన హిందువులు, జైనులు, క్రిస్టియన్లు, సిక్కులు, బౌద్ధులు, పార్సీలకు పౌరసత్వం అందించడానికి ఈ చట్టం రూపొందించారు.

– గత 14 సంవత్సరాలలో కనీసం ఐదు సంవత్సరాలలో భారతదేశంలో నివసించిన వలసదారులకు భారతీయ పౌరసత్వం మంజూరు లభిస్తుంది. ఇంతకుముందు వలసదారులకు పౌరసత్వం లభించాలంటే 11 సంవత్సరాలు నివసించాలని నిబంధనలు ఉండేవి.

– రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్‌లో చేర్చిన అస్సాంలోని కర్బీ ఆంగ్లోంగ్, మేఘాలయలోని గారో హిల్స్, మిజోరంలోని చక్మా జిల్లా, త్రిపురలోని గిరిజన ప్రాంతాల జిల్లాలతో సహా అస్సాం, మేఘాలయ, మిజోరాం, త్రిపురలోని గిరిజన ప్రాంతాలకు ఈ చట్టం నుంచి మినహాయింపు ఉంటుంది.

– డిసెంబర్ 2019లో సీఏఏను పార్లమెంట్ ఆమోదించింది. అనంతరం రాష్ట్రపతి ఆమోదం పొందిన తర్వాత ఈశాన్య ప్రాంతంతో సహా దేశంలోని కొన్ని ప్రాంతాల్లో భారీగా నిరసనలు వ్యక్తం అయ్యాయి.

– లోక్‌సభ ఎన్నికలకు ముందే సీఏఏ నిబంధనలను నోటిఫై చేసి అమలు చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా గతంలో ప్రకటించారు.

– భారత పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకోవడానికి అర్హులైన వారందరికీ చట్టం ప్రకారం దరఖాస్తులను సమర్పించే ప్రక్రియ మొత్తం ఆన్‌లైన్‌లోనే జరుగుతుంది.

– సీఏఏ చట్లం పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్ దేశాల నుంచి మన దేశానికి వచ్చిన ముస్లిమేతర పౌరులు హిందువులు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, పార్శీలు, జైనులకు మాత్రమే భారత పౌరసత్వం కల్పించేందుకు రూపొందించారు. ముస్లింలకు మాత్రం భారత పౌరసత్వం అందించకపోవడంతో వివాదం మొదలై తీవ్ర విమర్శలకు దారి తీసింది.

– ఈ చట్టం అమలుతో మన దేశంలోని ముస్లింల పౌరసత్వానికి ఎలాంటి ఇబ్బంది లేదు. ఇతర మతాలు, వర్గానికి చెందిన వారికి కూడా ఎలాంటి ముప్పు ఉండదు.

– పాకిస్థాన్, ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్ దేశాల నుంచి వలస వచ్చిన ముస్లింయేతరులకు మాత్రమే భారత పౌరసత్వం అందించనున్నారు. ఆ మూడు దేశాల్లో మతం పేరుతో హిందువులు, సిక్కులు, జైనులు, క్రిస్టియన్లు, బౌద్ధులు, పార్సీలు అణచివేతకు గురవుతున్నారని.. వలసదారులకు మన దేశానికి వచ్చిన వారికి పౌరసత్వం కల్పిస్తున్నట్లు కేంద్రం చెబుతోంది. ఆ దేశాల్లో ముస్లింలు మతం పేరుతో అణచివేతకు గురవ్వరని.. అందుకే వారిని చేర్చలేదని పేర్కొంటోంది. ఈ నిబంధన వివక్షకు కారణమవుతోందని వివాదం జరుగుతోంది.

# 26 రోజులు ఏం చేశారు..?

## ఎస్ బీఐని సూటిగా ప్రశ్నించిన సుప్రీంకోర్టు

### గడువు పెంచాలన్న విజ్ఞప్తిని తిరస్కరించిన అత్యున్నత న్యాయస్థానం
### ఈ నెల 15 సాయంత్రంలోగా వెబ్ సైట్ లో పెట్టాలంటూ ఈసీకి ఆదేశం

**మార్చి11(జర్నలిస్ట్ వార్త):** ఎలక్టోరల్ బాండ్స్ వివరాలను వెల్లడించేందుకు మరింత సమయం కావాలంటూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్ బీఐ) విజ్ఞప్తిని సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. గడువు పెంచేది లేదని తేల్చిచెప్పిన కోర్టు.. రేపటి (మార్చి 12) లోగా వివరాలు వెల్లడించాల్సిందేనని స్పష్టం చేసింది. ఈమేరకు ఎస్ బీఐ దాఖలు చేసిన పిటిషన్ ను సోమవారం విచారించిన అత్యున్నత న్యాయస్థానం.. ఎలక్టోరల్ బాండ్స్ వివరాలను వెంటనే ఎన్నికల కమిషన్ కు అందజేయాలని స్పష్టం చేసింది. ఎస్ బీఐ అందించే సమాచారాన్ని మార్చి 15 సాయంత్రం 5 గంటల్లోగా వెబ్ సైట్ లో ప్రజలకు అందుబాటులో ఉంచాలంటూ ఎన్నికల సంఘానికి ఆదేశాలు జారీ చేసింది.
రాజకీయ పార్టీలు అందుకునే విరాళాలలో పారదర్శకత కోసమంటూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎలక్టోరల్ బాండ్స్ ను గత నెల 15న అత్యున్నత న్యాయస్థానం రద్దు చేసింది. ఇప్పటి వరకు ఈ విధానంలో ఏయే పార్టీలు ఎంత మొత్తం అందుకున్నాయి, ఆయా విరాళాలు అందించిన వారి పేర్లు వివరాలను ఈ నెల 6 లోగా ఎన్నికల సంఘానికి అందించాలని ఎస్ బీఐ ని సుప్రీం ఆదేశించింది. గత నెల 15న ఈమేరకు తీర్పు వెలువరించింది. అయితే, బాండ్స్ వివరాలను వెల్లడించేందుకు మరింత సమయం కావాలని ఎస్ బీఐ అభ్యర్థించింది. దాతలు, గ్రహీతల వివరాలను వేర్వేరుగా భద్రపర్చామని, వాటిని మ్యాచ్ చేసి వివరాలను ఇచ్చేందుకు జూన్ 30 వరకు గడువు ఇవ్వాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఎస్ బీఐ దాఖలు చేసిన పిటిషన్ ను సోమవారం సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం విచారించింది. గత నెలలో తీర్పు వెలువరించినపుడు తగినంత సమయం ఇచ్చామని, ఈ 26 రోజులుగా దీనిపై ఏం చర్యలు తీసుకున్నారని ధర్మాసనం ప్రశ్నించింది. ఇన్ని రోజులు గడువు ఇచ్చి, ఎలక్టోరల్ బాండ్స్ వివరాలు ఉన్నది ఉన్నట్లుగా వెల్లడించాలని ఆదేశిస్తే మరింత గడువు కావాలని అభ్యర్థించడం తీవ్రమైన విషయమని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఏదేమైనా గడువు పొడిగించేది లేదని స్పష్టం చేస్తూ మంగళవారం సాయంత్రంలోగా బాండ్స్ వివరాలను ఎన్నికల సంఘానికి అందించాలని సీజేఐ నేతృత్వంలోని బెంచ్ స్పష్టం చేసింది.




# తెలంగాణ పాలిటిక్స్‌లో మార్చి-12 బిగ్ డే..



**మార్చి11(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ స్టేట్ పాలిటిక్స్‌లో బిగ్ డే కానుంది. మార్చి 12 తెలంగాణలో పొలిటికల్ హీట్ పెంచుతోంది. ఒకేరోజు రంగంలోకి అమిత్ షా, రేవంత్ రెడ్డి, కేసీఆర్ దిగనున్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పోటా పోటీ సభలు నిర్వహించనున్నారు. షెడ్యూల్‌కు ముందే పార్లమెంట్ ఎన్నికల శంఖారావాన్ని పార్టీలు పూరిస్తున్నాయి. అభివృద్ధి పనుల ప్రారంభం, శంకుస్థాపనలతో సీఎం రేవంత్ స్పీడ్ పెంచారు. పరేడ్ గ్రౌండ్‌లో రేవంత్ మహిళా శక్తి సభ.. మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాల కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. పార్లమెంటు ఎన్నికల కోడ్ ముందే పథకాలను రేవంత్ లాంచ్ చేస్తున్నారు. అలాగే కరీంనగర్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కదన భేరి బహిరంగ సభ నిర్వహించనున్నారు. కాళేశ్వరంపై ప్రభుత్వ వైఖరిని ఎండగట్టి ఎన్నికలకు పార్టీని సిద్ధం చేసేలా కేసీఆర్ ప్రసంగించనున్నారు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా సభ నిర్వహించనున్నారు. ఒకే రోజు మూడు ప్రధాన పార్టీల సభలతో ఆసక్తిగా తెలంగాణ రాజకీయం ఆసక్తికరంగా మారింది..

# పారిస్ ఒలింపిక్స్‌కు 28మంది హాకీ ఆటగాళ్లకు శిక్షణ



%భువనేశ్వర్: టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన భారత పురుషుల హాకీ జట్టు పారిస్ ఒలింపిక్స్‌కు ఆటగాళ్ల శిక్షణకు సిద్ధమైంది. 28మంది ఆటగాళ్లతో కూడిన జట్టును హాకీ ఇండియా(హెచ్‌ఐ) సోమవారం ప్రకటించింది.
ఈనెల 12 నుంచి 31వరకు భువనేశ్వర్‌లోని కలింగ స్టేడియంలో వీరందరికీ శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించింది. ఈ ఏడాది ఫ్రాన్స్‌లోని పారిస్ వేదికగా 2024 ఒలింపిక్స్ జరగనున్న దృష్ట్యా ఆటగాళ్లకు సన్నాహాలను చక్కదిద్దాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2023-24 ఎఫ్‌ఐహెచ్ హాకీ ప్రో లీగ్‌లో భారత ఆటగాళ్లు అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకొని ఈ శిక్షణా శిబిరానికి చేరుకోనున్నారు. ఈ ఏడాది ప్రొ లీగ్ ఆడేందుకు జూన్ 1న లండన్‌కు, ఆ తర్వాత నెదర్లాండ్స్ పర్యటనలకు భారత హాకీ జట్టు వెళ్లనుంది. అలాగే మే 22న బెల్జియం పర్యటనకు పయనం కావాల్సి ఉంది. ఆటగాళ్లకు శిక్షణ పూర్తయిన వెంటనే భారత బృందం ఆస్ట్రేలియాకు పయనం కానుందని పురుషుల జట్టు చీఫ్ కోచ్ క్రెయిగ్ పుల్టన్ తెలిపాడు.

జట్టు
గోల్‌కీపర్లు: కృషన్ బహదూర్, పిఆర్ శ్రీజేశ్, సూరజ్ కర్కేరా
డిఫెండర్లు: హర్మన్‌ప్రీత్, జర్మన్‌ప్రీత్, అమిత్ రోహిదాస్, గుర్జాజ్, సంజరు, సుమిత్, అమిర్ అలీ

# ఫలించని దీప్తి ఒంటరి పోరాటం.. యూపీపై గుజరాత్ విజయం

ఉమెన్స్ మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) రెండో సీజన్‌లో భాగంగా ఇవ్వాల జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్ విజయం సాధించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన గుజరాత్ యూపీ ముందు 153 పరుగులు టార్గెట్‌ను సెట్ చేసింది. అయితే ప్లేఆఫ్స్ రేసులో నిలవాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో యూపీ వారియర్స్ జట్టు తడబడింది. దీంతో నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 144 పరుగులు చేసి 8 పరుగుల తేడాతో ఓడిపోయింది.
యూపీ ఆల్‌రౌండర్ దీప్తి శర్మ (60 బంతుల్లో 88 నాటౌట్, 9 ఫోర్లు, 4 సిక్సర్లు) ఒంటరి పోరాటం చేసింది. పూనమ్ ఖేమ్నర్ (36 బంతుల్లో 36 నాటౌట్, 3 ఫోర్లు, 1 సిక్సర్) పరువాలేదనిపించింది. ఈ ఓటమితో యూపీ కథ ముగియగా ఆర్సీబీకి లైన్ క్లియర్ అయింది. గుజరాత్ బౌలర్లలో షబ్నమ్ షకీల్ మూడు వికెట్లు పడగొట్టింది. కాథరిన్ బ్రైస్, ఆష్లీ గార్డనర్ చెరో వికెట్ దక్కించుకున్నారు.ఇక అంతకముందు బ్యాటింగ్ చేసిన గుజరాత్ కెప్టెన్ బెత్ మూనీ (నాటౌట్) అద్భుత ఇన్నింగ్స్‌తో జట్టును ఆదుకుంది. 52 బంతుల్లో 74 పరుగులు (10 ఫోర్లు, 1 సిక్స్)తో హాఫ్ సెంచరీ చేసింది. ఇక ఓపెనర్ లారా వోల్వార్డ్ 30 బంతుల్లో 43 (8 ఫోర్లు, 1 సిక్స్)తో ఆకట్టుకుంది. మిగిలిన బ్యాటర్లు ఘోరంగా విఫలమ్యారు.



# టాలీవుడ్‌లో విషాదం.. డైరెక్టర్ సూర్య కిరణ్ మృతి!



టాలీవుడ్‌లో విషాదం చోటు చేసుకుంది. ప్రముఖ దర్శకుడు, రచయిత సూర్య కిరణ్ హఠాన్మరణం చెందారు. అనారోగ్యంతో చెన్నైలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన మృతిచెందారు. మొదటి సినిమా 'సత్యం'తోనే తెలుగు చిత్రసీమలో గుర్తింపు తెచ్చుకున్నారాయన. ఆ తర్వాత ధన 51, రాజూభాయ్, చాప్టర్ 6, నీలిమై తదితర చిత్రాలకు దర్శకత్వం వహించారు. పలు సినిమాల్లో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గానూ మెరిశారు. అలాగే కొన్ని చిత్రాలకు రచయితగా కూడా పనిచేశారు. సూర్యకిరణ్ నటి కల్యాణిని పెళ్లాడారు. కానీ, కొన్నాళ్లకు ఈ దంపతులు విడిపోయారు. ఈయన నటి సుజితకు సోదరుడు.టాలీవుడ్ లో ఇప్పుడు చాలామంది దర్శకులు .. తమ సినిమా కథలను తామే సొంతంగా తయారు చేసుకుంటున్నారు. అలాంటి ఒక ప్రయత్నాన్ని చాలా కాలం క్రితమే చేసిన దర్శకుడు సూర్యకిరణ్. రచయితగా .. దర్శకుడిగా ఆయన తన ప్రయాణాన్ని కొనసాగించాడు. 'సత్యం' సినిమాతో దర్శకుడిగా తన గురించి అంతా మాట్లాడుకునేలా చేశాడు. సూర్యకిరణ్ ఎవరో కాదు .. 'పసివాడి ప్రాణం' సినిమాలో నటించిన బేబీ సుజితకి అన్నయ్య. అయితే తాను కూడా బాలనటుడిగా చాలా చిత్రాలలో నటించాడనే విషయం చాలా తక్కువ మందికి తెలుసు. బాలీవుడ్ లో మిథున్ చక్రవర్తి .. అనిల్ కపూర్, కోలీవుడ్ లో రజనీకాంత్ .. కమల్ హాసన్ లకు చిన్నప్పటి పాత్రలను పోషించి మెప్పించాడు. అలాగే తెలుగులో చిరంజీవి నటించిన చాలా సినిమాలలో, ఆయన చిన్నప్పటి పాత్రను పోషించింది సూర్యకిరణ్. ఆ జాబితాలో మనకి రాక్షసుడు .. మగధీరుడు .. స్వయంకృషి .. కొండవీటి దొంగ .. దొంగమొగుడు .. ఖైదీ నెంబర్ 786 .. ఇలా చాలా చిత్రాలు కనిపిస్తాయి. బాలనటుడిగా రెండు జాతీయ అవార్డులను .. రెండు స్టేట్ అవార్డులను అందుకున్నాడు. అలాంటి సూర్యకిరణ్ హఠాన్మరణం పట్ల టాలీవుడ్ సానుభూతిని వ్యక్తం చేస్తోంది

# హీరోయిన్ ను పెళ్లాడబోతున్న హీరో కిరణ్ అబ్బవరం





టాలీవుడ్ సినిమా ఇండస్ట్రీలో ఇటీవల కాలంలో డీసెంట్ హిట్స్ తో మంచి క్రేజ్ అందుకున్న వారిలో కిరణ్ అబ్బవరం ఒకరు. చాలా తొందరగానే అతనికి మైత్రి మూవీ మేకర్స్ గీత ఆర్ట్స్ లాంటి కాంపౌండ్ నుంచి అవకాశాలు వచ్చాయి. ఇక సక్సెస్ ఫెయిల్యూర్స్ తో సంబంధం లేకుండా అవకాశాలు అందుకుంటూ వెళ్లిన కిరణ్ త్వరలోనే పెళ్లి చేసుకోబోతున్నాడు అంటూ గతంలో కొన్ని గాసిప్స్ పుట్టుకొచ్చిన విషయం తెలిసిందే. అతను నటించిన హీరోయిన్ తోనే వివాహం జరగబోతోంది అని ఇప్పటికే పెద్దలతో మాట్లాడడం కూడా జరిగింది అని సోషల్ మీడియాలో జోరుగా ప్రచారాలు వచ్చాయి. అయితే మళ్లీ ఒక్కసారిగా సైలెంట్ అయిపోయిన ఆ విషయం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారిపోయింది. నిజంగానే ఈ యువ హీరో తను ప్రేమించిన హీరోయిన్ ను పెళ్లి చేసుకోబోతున్నాడు. ఆమె మరెవరో కాదు అతని మొట్టమొదటి హీరోయిన్ అని తెలుస్తోంది. రాజావారు రాణి గారు సినిమా 2019లో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమా ఓ వర్గం ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. ఇక అందులో హీరోయిన్ గా నటించిన రహస్య ఘోరక్ హీరో కిరణ్ అబ్బవరం మధ్యలో మంచి స్నేహభావం ఏర్పడింది. అనంతరం వారి స్నేహం ప్రేమగా మారినట్లుగా తెలుస్తోంది. వెండితెరపై వీరిద్దరి కెమిస్ట్రీ బాగా వర్కౌట్ అయింది. ఒక విధంగా ఆ సినిమాకు సక్సెస్ లో మేజర్ ప్లస్ పాయింట్ గా నిలిచారు అని చెప్పవచ్చు. ఇక ఇప్పుడు నిజ జీవితంలో కూడా ఈ ఇద్దరు జంటగా కనిపిస్తూ ఉండడం విశేషం. కిరణ్ హీరోయిన్ రహస్య ఘోరక్ రాజా ఎంగేజ్మెంట్ ఈ నెల 13న జరిగనున్నట్ల తెలుస్తోంది. కేవలం కుటుంబ సభ్యుల సమక్షంలో చాలా ప్రయివేట్ గా జరిగే ఈ వేడుకకు ఇండస్ట్రీలోని అతికొద్ది మంది మాత్రమే హాజరు కానున్నట్లు సమాచారం. ఇక ఈ జంట ఆగస్టులో డెస్టినేషన్ వెడ్డింగ్ కోసం విదేశీ లొకేషన్‌కు వెళ్లనున్నట్లు తెలుస్తోంది. ఇక కిరణ్ అబ్బవరం కెరీర్ విషయానికి వస్తే రాజ వారు రాణి గారు సక్సెస్ తరువాత ఎస్ఆర్ కళ్యాణమండపం అనే సినిమాతో మరో మంచి సక్సెస్ అందుకున్నాడు. ఆ తరువాత సెబాస్టియన్ అనే సినిమా డిజాస్టర్ అయినప్పటికీ వెంటనే మళ్ళీ సమ్మతమే అనే సినిమాతో మరో డీసెంట్ సక్సెస్ చూశాడు. ఇక తర్వాత 'నేను మీకు బాగా కావాల్సిన వాడిని', వినరో భాగ్యము విష్ణు కథ, మీటర్ లాంటి సినిమాలు చేశాడు. ఈ మధ్యనే రూల్స్ రంజాన్ అనే సినిమా కూడా రిలీజ్ చేశాడు. అయితే ఈ సినిమాలేవి కూడా అతనికి అంతగా సక్సెస్ ఇవ్వలేదు. కాస్త బ్రేక్ తీసుకున్న ఈ హీరో పెళ్లి తర్వాత మళ్ళీ తన కెరీర్ పై మరింత ఫోకస్ పెంచనున్నట్లు తెలుస్తోంది

# క్రియేటర్స్ అంతా ఒకే చోట! తెలుగు డిజిటల్ మీడియా ఫెడరేషన్ ప్రారంభం

డిజిటల్ యుగంలో కొత్త శకం ఆవిష్కృతమైంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు కంటెంట్ క్రియేటర్లందరినీ ఏకంగా చేసేందుకు తెలుగు డిజిటల్ మీడియా ఫెడరేషన్- తెలుగుడీఎంఎఫ్ ప్లాట్ ఫామ్ అధికారికంగా ప్రారంభమయింది. తెలుగుడీఎంఎఫ్ అఫీషియల్ వెబ్ సైట్ www.telugudmf.comను మెగాస్టార్ చిరంజీవి ప్రారంభించారు. తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఫెడరేషన్ లోగోతోపాటు వెలకమ్ పోస్టర్ ను రివీల్ చేశారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న డిజిటల్ క్రియేటర్స్ ను ఏకం చేసేందుకు ఫెడరేషన్ రూపంలో తీసుకున్న చొరవను మెగాస్టార్ ప్రశంసించారు. "వెబ్ సైట్ కంటెంట్ రైటర్‌లు, ఇన్ స్టాగ్రామ్ ఇన్ ఫ్లుయెన్సర్‌లు, ట్విట్టర్ పర్సనాలిటీలు, మీమ్ క్రియేటర్లు తదితర విభిన్న కంటెంట్ క్రియేటర్ లను ఏకం చేయాలనుకోవడం సంచలనమైన విషయం. వారికి మార్గదర్శకత్వం, ఆరోగ్య ప్రయోజనాలు, కొలాబరేటివ్ పార్ట్‌నర్ షిప్స్ కోసం ఫెడరేషన్ ప్రారంభించడం ప్రశంసనీయం" అంటూ కొనియాడారు.
%యాశ్రీంశీ =ముఃం% - 'యానిమల్' సీక్వెల్ ఇంకా ఎప్పటికి? ఈ గొప్ప ప్రయత్నాన్ని తాను ప్రారంభించినందుకు చాలా గర్వంగా ఉందని చిరంజీవి తెలిపారు. తెలుగు డిజిటల్ మీడియా ఫెడరేషన్ కు శుభాకాంక్షలు తెలిపారు. వ్యవస్థాపక సభ్యుల అంకితభావాన్ని కొనియాడారు. అయితే తెలుగుడీఎంఎఫ్ కు రాష్ట్ర ప్రభుత్వం కూడా సహకరిస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరావు తెలిపారు. గ్లోబల్ కంటెంట్ క్రియేటర్లను తెలుగుడీఎంఎఫ్ ఏకం చేయడం పట్ల తన విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. "తెలుగు డీఎంఎఫ్ కేవలం ఒక సమాఖ్యగా కాదు. అంత కన్నా ఎక్కువగా పనిచేస్తుంది. ఓ శక్తివంతమైన వ్యవస్థగా నిలుస్తుంది. ఈ ప్లాట్ ఫామ్ ద్వారా ప్రపంచ



వ్యాప్తంగా ఉన్న సృజనాత్మక మనసులు కలుస్తాయి. తెలుగు డిజిటల్ కంటెంట్ ను అపూర్వమైన గుర్తింపుతో సమిష్టిగా ముందుకు నడిపిస్తాయి" అని తెలుగుడీఎంఎఫ్ ఫౌండర్లు తెలిపారు. అయితే ఈ సంచలనాత్మక చొరవలో సమగ్ర భాగస్వాములు కావాలని తెలుగుడీఎంఎఫ్.. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు కంటెంట్ క్రియేటర్లందరినీ ఆహ్వానించింది. ఫెడరేషన్ కు సంబంధించిన పూర్తి వివరాల కోసం hello@telugudmf.com వెబ్ సైట్ ను సంప్రదించమని కోరింది. తమ క్రియేటివేటీని ప్రపంచ వ్యాప్తంగా చాటాలని తెలిపింది. పని, సంక్షేమం, వెబ్ బింగ్ లో ఎంకరేజ్ చేసేందుకు తెలుగుడీఎంఎఫ్ ముందుకొచ్చింది. సభ్యుల సృజనాత్మకతను వెలికితీసేందుకు, సమస్యలకు పరిష్కారం చూపించేందుకు, వైద్య బీమా ప్రయోజనాల లాంటి అవసరమైన కార్యక్రమాలను తీసుకురానుంది. ఈ మేరకు ప్లాట్ ఫామ్ సిద్ధం చేసింది. జవాబుదారీతనం, ప్రామాణికతను తీసుకురావడంతో పాటు విస్తృతమైన గ్లోబల్ నెట్ వర్క్ కు అనుసంధానం చేసే ఆలోచన ఉంది. ప్రపంచ దేశాల్లో ఉన్న తెలుగు కంటెంట్ సృష్టికర్తలు తమ కంటెంట్ ను ప్రపంచవ్యాప్తంగా అందించడం కోసం ఈ ఏర్పాటు చేసింది. మరి ఈ ఫెడరేషన్ ఎలాంటి సంచలనం సృష్టిస్తుందో చూడాలి